# ఎడారి మృగం

అతడు ....

నిప్పుకణికెలమీద చలిస్తున్నట్టు ఎడారి మధ్యలో నడుస్తూ...నడుస్తూ పడిపోయాడు. వాటర్ బాటిల్‌లో మిగిలిన తడి ఆవిరైంది.

గాలిలో మంటల కెరటాలు పొంగుతున్నంత ఎండ....

పడిపోయిన అతడు... ఎంతసేపున్నాడో?

చాలాసేపటికి...అపస్మారక స్థితిలో "దాహం" అన్నాడు. ఎవరూ వినలేదు. వినటానికి మనుషులుండేచోటు కాదది. చుట్టూ ఇసుకదిబ్బలూ, భయంకరమైన ఎడారి. అప్పుడప్పుడూ ఇసుకరేణువులు సుడిగాలిలా ఎగిసి అతడి శరీరంపై మేట వేస్తున్నాయి.

వాటర్‌బాటిల్‌కోసమేమో...అతడి చేయి ఇసుకలో తచ్చాడుతోంది.

అతడి పెదవులు అస్పష్టంగా పలుకుతున్నాయి.

ద్‌ద్‌ద్‌ఆఆఆఆహ్‌మ్‌...పలికి పలికి గొంతులో తడిసైతం ఆరిపోయిందేమో మాటకు బదులు గుండెల్లోంచి గాలి పెదాల్ని తాకి పోతుంటే పాము బుసలా వస్తోంది.

పిడచకట్టుకుపోయిన నాలుక బలవంతాన పెదాల్ని తాకడానికి ప్రయత్నిస్తోంది. అచేతనావస్థలోనూ అతడి మనసు ఏదో వింటోంది.

పర్...పర్ మంటున్న ఇసుక శబ్దం.

అది ఇసుకలో ఒంటె అడుగుల శబ్దం. అంటే ఇసుకలో ఇదే దారిలో ఎవరో వస్తున్నారు. సూర్యుని వేడి అతని కనురెప్పల్ని అదిమి పట్టింది. తెరిచే స్థితిలోకూడా లేడు. "దాహం" అని గట్టిగా అరిచాననుకు న్నాడు. కాని ఆ అరుపు బుసలా బయటికొచ్చింది.

స్వేదం సైతం ఆవిరై పోయి శరీరం కట్టెలా బిగుసుకునేంత వేడికి తోడు నాలుకకూడా ఎడారిగా మారి, అతడ్ని బాధిస్తోంది.

అయినా మనసు చేతనావస్థలో వుంది. అడుగుల శబ్దం దగ్గరైనట్లు అతడు గ్రహించి మరోసారి బుసకొట్టాడు.

ఆ ఎడారిలో మరో బాటసారి. అతడి దగ్గరగా వచ్చి, ఒంటెమీంచి దూకాడు. మోకాళ్ళమీద వంగి, అతడి నాడి చూసి ప్లాస్టిక్ బ్యాగులోంచి కొన్ని నీళ్ళు తీసి మొహం మీద చిలకరించాడు.

మంచులాంటి చల్లదనానికి ఒళ్ళంతా పులకరించి, చప్పున తెలివొ చ్చిందతనికి. రెండు చేతులు దోసిలిలా చేసి, దాహం అన్నట్టుగా అర్థిం చాడు. ప్లాస్టిక్ బ్యాగ్ మూత బిగిస్తున్నవాడల్లా మూతతీసి, నీళ్ళు పోయ బోయి ఆగాడు.

అతడు మళ్ళీ అర్థించాడు ఆ 'ఒంటె' మనిషిని.

నిమిషం తర్వాత అడిగాడు. "నీ దగ్గర డబ్బెంత వుంది?"

"అయిదువేలు" అనలేక అయిదువేళ్ళు చూపించాడు. అతడి నిస్సహాయ స్థితిని గమనించిన ఒంటె మనిషి ఒక్క గుక్క అతడి నోట్లో పోశాడు. వెంటనే ప్రక్కనే పడివున్న బ్యాగులోని వస్తువులు ఇసుకలో గుమ్మరించాడు.

బట్టలు, బ్రెడ్, స్నాక్స్, నోట్లకట్టలు చిందరవందరగా రాలి పడ్డాయి.

ఒంటె మనిషి నాలుగువేల రూపాయల్ని మాత్రమే తన బ్యాగులో వేసుకుని, మరో గుక్క నీళ్ళు పోసి పరుగులాంటి నడకతో వెళ్ళిపో యాడు.

"ఒరేయ్ లం...కొడకా" కోపంగా అరచిన అతని అరుపుకి తడి-సిన గొంతు మళ్ళీ ఆరిపోయింది.

పఱ్రుపఱ్రుమంటున్న ఒంటె అడుగుల శబ్దం దూరమవుతున్నకొద్దీ అతనిలో దుఃఖం పొంగింది. వేగంగా వచ్చిన గాలికి తేలికైన బ్యాగు కొంతదూరం వెళ్లి ఆగింది.

మళ్లీ మునుపటి పరిస్థితి.

క్షణాలు సంవత్సరాల్లా గడుస్తున్నాయి. శరీరం పెనంమీద పొర్లి-స్తున్నంత వేడిగా కాలిపోతోంది. గంట గడిచింది. నోరెండుకుపోయి అతడు అపస్మారకంలోకి పోతున్నవాడల్లా దూరంగా మళ్లీ అదే శబ్దం, జుయ్‌జుయ్‌మంటున్న గాలి శబ్దంతోపాటు ఇసుకలో అడుగుల శబ్దం.

ఒంటెలా బరువైన శబ్దంకాదు. తేలికగా వస్తున్న చప్పుడు.

దాహం అనలేక ఈసారి మూలిగాడు. ప్రక్కకు ఒత్తిగిలి బలవం-తంగా అరమోడ్పు కళ్లతో చూసాడు.

ఎవరో బాటసారి గాడిదమీద వస్తున్నాడు.

తన దిక్కుగానే.

ఈసారి అతడు బలాన్ని కూడదీసుకుని తనకు దగ్గర్లో పడున్న వెయ్యిరూపాయల కట్టను చేతితో తీసికొని దాహం అని సైగచేసి అర్థిం-చాడు.

గాడిదమీంచి దిగి దగ్గరకొచ్చిన ఆ వ్యక్తి కళ్లు డబ్బు చూడగానే మెరిసాయి.

"నీళ్లా??" అని అడిగాడు బిగ్గరగా.

ఇతడు తలూపాడు. దాహం తీరిస్తే డబ్బిస్తానని సైగ చేశాడు. ఆ వ్యక్తి గబగబా గాడిద వీపుమీదున్న బాటిల్ తీసి గ్లాసులోకి వంచాడు.

ఒక్క చుక్కకూడా రాలలేదు.

"ఒక్క నిమిషం ఆగు. ఇంకో బాటిల్ కూడా వుంది" అని గాడి-

దకు ఆ వేపు వెళ్లి గ్లాసులో నీటితో వచ్చాడు. ఆ వ్యక్తి గ్లాసందివ్వక ముందే అతడు డబ్బందించాడు.

అతని కుడిచేతిలో పదిలంగా గ్లాసునుంచి ఆవ్యక్తి డబ్బుతో గాడిద మీదెక్కి వేగంగా పోయాడు.

క్షణం తర్వాత గొంతులో దిగిన తడి కడుపులో వికారాన్ని చేర్చింది.

అది మాత్రం.

కసి, బాధ, దుఃఖం అన్నీ కలిసిన అతడు విసురుగా గ్లాసును విసిరేసాడు. నిస్సహాయంగా అది అతని ప్రక్కనే పడింది.

మనసు బండబూతులు తిడుతోంది. గంట గడిచాక అతడు చావుకు అతి దగ్గరగా వున్నాడు. సన్నగా తెరుచుకున్న నోటిలోంచి గండుచీమలు వెళ్తూ బయటికొస్తున్నా గుర్తించలేనంత హీనస్థితిలో వున్నాడు.

అతనికిప్పుడు ఎవరి అడుగుల చప్పుడూ వినిపించడంలేదు.

గుండె ఆగి ఆగి కొట్టుకుంటోంది. శ్వాస బరువుగా వస్తూ పోతోంది.

అప్పుడొచ్చింది ఓ లంబాడీ యువతి ఆ దారంట.

అతన్ని, అతడి స్థితిని చూసిన వెంటనే నలుదిక్కులా ఉరికింది "ఒయాసిస్సుల" కోసం. ఎక్కడా కన్పించలేదు అలాంటి చెలిమలు.

దూరంగా వెళ్తున్న ఒంటెలకేసి పరిగెత్తి అరిచింది. వాళ్లు ఆమెని పట్టించుకోకుండానే కనుమరుగయ్యారు.

అతని స్థితి చూసి ఆమె కళ్లు కడగండ్లయ్యాయి. అతడి దాహాన్ని తీర్చడానికి ఆమె దగ్గర నీటిచుక్క కూడా లేదు.

జాలితో 'అయ్యో' అనిగుండెలమీదచెయ్యివేసుకున్నదల్లాఆగిపోయింది క్షణకాలంపాటు ఆమెలో కలవరం....అంతే! ఆమె రవిక ముడి విప్పింది.

రెండేళ్ల పాపకి తల్లయిన ఆ లంబాడీ యువతి తన స్తన్యాన్ని

అతడి పెదాల దగ్గరగా వుంచి వొత్తిపట్టింది. బొట్లు బొట్లుగా పాల చుక్కలు.

అతడి గొంతు దగ్గర నరాల కదలిక. నాలుకలో చలనం వచ్చి కొంచెం కదలాడింది. ఆ కదలికల్ని చూసిన ఆమె కళ్లల్లో అనంతకోటి ఆనంద కెరటాలు.

అతడి తలను ఒడిలోకితీసుకుని పసివాడిలా తన స్తన్యాన్ని వుంచింది. పాలు ధారగా అతడి గుండెలో నిండుతుంటే పదినిమిషాల్లో పూర్తిగా కోలుకున్న మనిషిలా చలించి కళ్లు విప్పాడు.

అద్దాల రవికతో, నెత్తిమీద కొంగుతో అందమైన లంబాడీయువతి. వెండి దుద్దులు ఆమె చెవుల్ని సాగదీస్తున్నాయి. అమాయకత్వం నింపుకున్న కళ్లు ఆనందంగా వర్షిస్తున్నాయి.

అతడిలో స్పర్శ రేగింది.

అది కొద్దిసేపట్లో కోర్కెగా మారింది. మనిషిలా చచ్చిపోవాల్సినవాడిలో మృగం జూలు విచ్చుకుంది. శక్తినంతా కూడదెచ్చుకుని ఆమెపై పడ్డాడు. హఠాత్పరిణామానికి విస్తుపోయి శక్తి కోల్పోతుంటే నిస్సహాయంగా చేతులెత్తి మొక్కింది.

శక్తిమేరకు గాయపరిచి ఆక్రమించుకున్నాడు.

కొద్దినిమిషాల్లో ఆమె మూలుగులు నిశ్చలమైపోయాయి. ఇసుక రేణువులు మరింత వేడెక్కాయి.

ఆమె నిర్జీవంగా పడిపోయినా అతడులేచి నడుస్తున్నాడు వేగంగా.

ఒక పెద్ద సుడిగాలి ఆకాశాన్ని తాకుతున్నంతగా ఇసుక తుఫాన్ లేచింది. అతడివేపే విసురుగా వస్తోంటే అతడు పరుగెత్తుతున్నాడు. భీతితో! భయంతో.... ★

★★
★★